

సివరేజీ పనులను ప్రారంభించిన కార్పొరేటర్ మన్నె కవితారెడ్డి

దశల వారీగా పెండింగ్ పనులు పూర్తి

బంజారాహిల్స్, జూన్ 25 (ఆంధ్రజ్యోతి): పెండింగ్ పనులను దశల వారీగా పూర్తి చేయనున్నట్టు వెంకటేశ్వరనగర్‌కాలనీ డివిజన్ కార్పొరేటర్ మన్నె కవితారెడ్డి అన్నారు. బంజారాహిల్స్ రోడ్డు నంబర్.10 నూర్‌నగర్‌లో డ్రైనేజీ పైప్ లైన్ పనులను మంగళవారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బస్తీల్లో నూతన పైప్‌లైన్ కోసం నిధులు మంజూరయ్యాయని, ఎన్నికలు అడ్డు రావడంతో పనులు ఆగిపోయాయని తెలిపారు. పనులు వెంటనే ప్రారంభించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో తట్టికాన జలమండలి మేనేజర్ రాంబాబు తదితరులు పాల్గొన్నారు.



వీపీ సింగ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న జాజుల తదితరులు

రిజర్వేషన్లపై పార్లమెంట్‌లో ప్రధాని ప్రకటన చేయాలి

కవాడిగూడ, జూన్ 25 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం జరుగుతున్న పార్లమెంట్ సమావేశాల్లో దేశంలో సామాజిక రిజర్వేషన్లపై ప్రధాని నరేంద్రమోదీ స్పష్టమైన విధాన ప్రకటన చేయాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ డిమాండ్ చేశారు. మంగళవారం నగరంలోని ఇందిరా పార్కు చౌరస్తాలో ఉన్న బీసీ భవన్‌కార్యాలయంలో ఓబీసీలకు ఉద్యోగ రంగంలో 27శాతం రిజర్వేషన్లును కల్పించిన మాజీ ప్రధాని, స్వర్గీయ వీపీ సింగ్ 93వ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం జరిగిన సభలో జాజుల మాట్లాడుతూ ఇటీవల పాట్నా హైకోర్టు ఇచ్చిన తీర్పుపై ఢిల్లీలో అఖిలపక్ష రాజకీయ పార్టీల సమావేశం ఏర్పాటు చేయాలని కోరారు. ప్రధాని మోదీ బీసీలకు జరిగిన అన్యాయాన్ని గ్రహించి దేశవ్యాప్తంగా బీసీ కుల గణన చేపట్టి జనాభా దమాషా ప్రకారం బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు పెంచాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీసీ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ విజయ్ భాస్కర్, బీసీ నేతలు బూడిద మల్లికార్జునయాదవ్, పానుగంటి విజయ్, మాదేశీ రాజేందర్, వీరమల్ల కార్తీక్, ప్రవీణ్‌యాదవ్, భాస్కర్, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

6 నుంచి వారాహి దేవి నవరాత్రి ఉత్సవాలు



బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న శ్రీనివాస్ తదితరులు

ఎల్బీనగర్, జూన్ 25 (ఆంధ్రజ్యోతి): ఆర్‌కేపురంలోని కర్తాలపీఠం వారాహి సమేత ప్రత్యంగిరా పరమేశ్వరి దేవాలయంలో జూలై 6 నుంచి 14వ తేదీ వరకు వారాహిదేవి నవరాత్రి ఉత్సవాలు నిర్వహిస్తున్నామని ఆలయ కార్యదర్శి మునిపల్లె శ్రీనివాస్ తెలిపారు. మంగళవారం ఆలయంలో నవరాత్రి ఉత్సవాల బ్రోచర్‌ను భక్తుల సమక్షంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నవరాత్రి ఉత్సవాలలో ప్రతిరోజూ ఉదయం 6.30 గంటలకు విశేష అభిషేకం, 10.30 గంటలకు కుంకుమార్చన, సాయంత్రం 6 గంటలకు పారాయణము, లలిత, విష్ణు సహస్రనామాలు, సౌందర్యలహరి, హనుమాన్ చాలీసా పారాయణాలు ఉంటాయన్నారు. రాత్రి 7.30 గంటలకు మహా నక్షత్ర హారతులు జరుగుతాయన్నారు. జూలై 10వ తేదీ సాయంత్రం 6 గంటలకు లక్ష బిల్వార్చన, 12వ తేదీ సాయంత్రం 6 గంటలకు లక్ష పుష్పార్చన కార్యక్రమాలు జరుగుతాయన్నారు.

జాలర్లను బెదిరించి డబ్బులు లాక్కున్న రౌడీషీటర్

- ఇర్ఫాన్ కోసం గాలిస్తున్న నార్సింగ్ పోలీసులు

నార్సింగ్, జూన్ 25 (ఆంధ్రజ్యోతి): చెరువులో చేపలు పట్టుకుంటున్న జాలర్లను బెదిరించిన ఓ రౌడీషీటర్ వారి వద్ద నగదు లాక్కున్నాడు. నార్సింగ్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రాజేంద్రనగర్ పోలీస్‌స్టేషన్‌లో రౌడీషీటర్‌గా నమోదైన ఇర్ఫాన్ సోమవారం రాత్రి స్నేహితులతో కలిసి పీరంచెరువు కట్టపై మద్యం తాగాడు. అదే సమయంలో చెరువులో చేపల వేట కోసం వలలు వేసేందుకు వచ్చిన ఉప్పర్‌పల్లికి చెందిన సందీప్‌కుమార్ అతడి సహచరుల వద్దకు ఇర్ఫాన్ మనుషులు వెళ్లారు. 'ఇప్పటికే అనేక మర్డర్లు చేశాను. వారం రోజుల క్రితమే జైలు నుంచి వచ్చాను. మిమ్మల్ని చంపి మళ్లీ జైలుకు పోతాను' అంటూ ఇర్ఫాన్ కత్తి తీసి జాలార్ల ముందు తిప్పడంతో వారికి స్వల్ప గాయాలయ్యాయి. జేబులో ఎంత ఉంటే అంత డబ్బులు ఇవ్వాలని ఇర్ఫాన్ డిమాండ్ చేయడంతో సందీప్‌కుమార్ జేబులో ఉన్న రూ.11వేలు ఇర్ఫాన్‌కు ఇచ్చేసి అక్కడి నుంచి పారిపోయారు. తర్వాత పోలీసులకు ఫిర్యాదు చేయగా వారు వెళ్లి వెతికినా అతడి ఆచూకీ లభించలేదు. గతంలో పీరంచెరువు వద్ద డ్రంకెన్ డ్రైవ్ టెస్టులు జరుగుతున్న సమయంలో ఇర్ఫాన్ ద్విచక్ర వాహనాన్ని కాల్చివేసి హంగామా సృష్టించాడు. నార్సింగ్ పోలీసులు అతడిని అరెస్టు చేసి జైలుకు పంపారు. ప్రస్తుతం ఇర్ఫాన్ కోసం పోలీసులు గాలిస్తున్నారు.

డాబర్ ఉత్పత్తులతో కమీషన్ అంటూ మోసం

యూసుఫ్‌గూడ, జూన్ 25 (ఆంధ్రజ్యోతి): డాబర్ ఉత్పత్తుల అమ్మకంతో ఎక్కువ కమీషన్ వస్తుందని చెప్పగా నమ్మిన మహిళ మోసపోయింది. మధురానగర్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వెంగళరావునగర్‌లో నివాసం ఉంటున్న కె.మమత మియాపూర్‌లోని ఓ ప్రైవేట్ సంస్థలో పనిచేస్తున్నారు. ఈమెకు ఇటీవల వాట్సాప్ ద్వారా మెసేజ్ వచ్చింది. తన పేరు నేహా అని డాబర్ కంపెనీలో హెచ్‌ఆర్ అని ఓ మహిళ పరిచయం చేసుకున్నారు. ఆన్‌లైన్‌లో డాబర్ ఉత్పత్తుల అమ్మకం ద్వారా ఎక్కువ కమీషన్ వస్తుందని నమ్మించారు. రిజిస్ట్రేషన్‌కు రూ.100, డాబర్ ఉత్పత్తులు పంపేందుకు రూ.1100, తదితర వాటి కోసం రూ.600 పంపాలని చెప్పారు. మొత్తం కలిపి మమత రూ.1700 పంపారు. ఆ తర్వాత ఉత్పత్తులు అమ్మవచ్చని, మెంబర్ అయ్యావని చెప్పి రూ.1700 తిరిగి పంపించారు నేహా. మరుసటి రోజు ఉత్పత్తుల కోసం డబ్బులు పంపాలని చెప్పడంతో మమత రూ.74,450 పంపారు. డాబర్ ఉత్పత్తులు రాలేదు. మోసపోయానని గ్రహించిన మమత పోలీసులకు ఫిర్యాదు చేశారు.

యమ డేంజర్

- చెత్తకుప్పల మధ్య విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు
- పలుచోట్ల వేలాడుతున్న విద్యుత్ తీగలు
- పొంచి ఉన్న ప్రమాదాలు
- పట్టించుకోని అధికారులు




నేతాజీనగర్‌లో చెత్తకుప్పల మధ్యన ట్రాన్స్‌ఫార్మర్లు



నందానగర్‌లో ప్రమాదకరంగా వేలాడుతున్న విద్యుత్ తీగలు



వేంకటేశ్వరకాలనీ వద్ద తెరిచి ఉన్న ఫ్యూజ్ బాక్స్



ఆక్స్‌ఫర్డ్ స్కూల్ వద్ద ప్రమాదకరంగా విద్యుత్ తీగలు

ఎర్రగడ్డ, జూన్ 25 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ(టీజీఎస్పీడీసీఎల్) సంస్థ డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్ల నిర్వహణ గాలికి వదిలేసింది. ట్రాన్స్‌ఫార్మర్ల పరిసరాలు పిచ్చిమొక్కలు, చెత్తకుప్పలతో నిండాయి. కొన్ని ట్రాన్స్‌ఫార్మర్ల చుట్టూ విద్యుత్ తీగలు వేలాడుతూ ప్రమాద గంటికలు మోగిస్తున్నా అధికారులు వాటిని సరిచేయడం లేదు. బస్తీలు, కాలనీల్లో చేతికి అందే ఎత్తులో ట్రాన్స్‌ఫార్మర్లు ఉండడం, తీగలు రోడ్లకు తగులుతుండడం, ఫ్యూజ్ బాక్స్‌లకు మూతలు లేకపోవడంతో అటువైపుగా వెళ్లాలంటేనే స్థానికులు భయపడుతున్నారు.

ఎర్రగడ్డ డివిజన్ నేతాజీనగర్‌లోని ట్రాన్స్‌ఫార్మర్లు పూర్తిగా చెత్తకుప్పల మధ్యన ఉన్నాయి. గతంలో రెండు ట్రాన్స్‌ఫార్మర్లు పేలాయి. దీంతో అధికారులు కొన్ని నెలల వరకు తాత్కాలిక వాహనంపై ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేశారు. దీనివల్ల ట్రాఫిక్ సమస్యలు కూడా తలెత్తాయి. నందానగర్, వేంకటేశ్వరకాలనీ, ప్రేమ్‌నగర్, ఓల్డ్ సుల్తాన్‌నగర్, ఆక్స్‌ఫర్డ్ హైస్కూల్ తదితర ప్రాంతాల్లో విద్యుత్ తీగలు కిందికి వేలాడుతున్నాయి.

ప్రజలకు ప్రాణహాని



ఎర్రగడ్డ డివిజన్‌లోని చాలా ప్రాంతాల్లో మూత లేని ఫీజు బాక్సులు ఉన్నాయి. ప్రమాదకరంగా వేలాడుతున్న విద్యుత్ తీగలతో ప్రజలకు ప్రాణహాని పొంచి ఉంది. అధికారులు సత్వరమే చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. ప్రమాదాలు జరగక ముందే అధికారులు చర్యలు తీసుకోవాలి.

\- మహ్మద్ ఖలీల్, ప్రేమ్‌నగర్

అధికారుల మధ్య కుదరని సఖ్యత

చాలాప్రాంతాల్లో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు, కిందికి వేలాడుతున్న విద్యుత్ తీగల మధ్యనే చెత్తకుప్పలు ఉండడం వల్ల ప్రజలకు ప్రమాదం పొంచి ఉంది. ఇందుకు మున్సిపల్, విద్యుత్ శాఖల అధికారుల మధ్య సఖ్యత లేకపోవడమే కారణమని పలువురు ఆరోపిస్తున్నారు.

వేర్వేరు ప్రాంతాల్లో అగ్నిప్రమాదాలు

- వ్యాపించిన దట్టమైన పొగ
- మంటలను అదుపులోకి తెచ్చిన అగ్నిమాపక సిబ్బంది
- ఇబ్బంది పడిన వాహనదారులు

రెండు వేర్వేరు ప్రాంతాల్లో అగ్నిప్రమాదాలు జరిగాయి. దట్టమైన పొగలు వ్యాపించాయి. అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపులోకి తెచ్చారు. ఎలాంటి ప్రాణనష్టం జరగకపోవడంతో అందరూ ఊపిరిపీల్చుకున్నారు.



ఫాబ్ ఇండియా భవనంలో అలుముకున్న దట్టమైన పొగ



సాఫ్ట్‌వేర్ కంపెనీలో కాలిన ఫర్నీచర్

బంజారాహిల్స్, జూన్ 25 (ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్ రోడ్ నంబర్.36లో ఫాబ్ ఇండియా బహుళ అంతస్తుల భవనం ఉంది. మొదటి అంతస్తులో గోడౌన్ ఉంది. దీని నుంచి మంగళవారం సాయంత్రం దట్టమైన పొగలు వచ్చాయి. అప్రమత్తమైన సిబ్బంది ఫిలింనగర్ అగ్నిమాపక కేంద్రానికి, జూబ్లీహిల్స్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. అగ్నిమాపక సిబ్బంది రెండు అగ్నిమాపక శకటాలతో గంటన్నరపాటు శ్రమించి మంటలను ఆర్పారు. భవనం నుంచి దట్టమైన పొగలు జూబ్లీహిల్స్ ప్రధాన రహదారికి విస్తరించడంతో వాహనదారులు కూడా ఇబ్బంది పడ్డారు. ఎదురుగా వచ్చే వాహనాలు కనబడక తికమక పడ్డారు. ట్రాఫిక్ పోలీసులు ప్రత్యామ్నాయ దారిలో వాహనాలను మళ్లించారు. జూబ్లీహిల్స్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



సాఫ్ట్‌వేర్ కంపెనీలో అలుముకున్న పొగలు

సాఫ్ట్‌వేర్ కంపెనీ భవనంలో..

జూబ్లీహిల్స్‌లోని సాఫ్ట్‌వేర్ కంపెనీ భవనంలో అగ్నిప్రమాదం జరిగింది. జర్నలిస్టుకాలనీ బస్టాప్ ఎదురుగా ఉన్న ఐవీవై పేరిట 16 అంతస్తుల భవనం ఉంది. ఇందులో ఆరు అంతస్తులు పార్కింగ్ కోసం కేటాయించగా మిగతా అంతస్తుల్లో సాఫ్ట్‌వేర్ కంపెనీతో పాటు పలు కార్యాలయాలు ఉన్నాయి. కాగా, 10వ అంతస్తుల్లో ఆధునికీకరణ పనులు జరుగుతుండడంతో దానికి సంబంధించిన చెక్కలు ఇతర సామగ్రిని నాలుగో అంతస్తులో ఉంచారు. ఇక్కడే కొన్ని ఫైల్స్ కూడా ఉన్నాయి. మంగళవారం మధ్యాహ్నం నాలుగో అంతస్తు నుంచి దట్టమైన పొగలు వచ్చాయి. క్షణాల్లో నల్లటి తెర మాదిరి పొగ వ్యాపించడంతో వివిధ కంపెనీల్లో పనిచేస్తున్న ఉద్యోగులు పరుగులు తీశారు. కొద్దిసేపటి తర్వాత మంటలు చెలరేగాయి. సమాచారం అందుకున్న ఫిలింనగర్ అగ్నిమాపక సిబ్బంది శకటాలతో వచ్చి మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. ఎటువంటి ప్రాణనష్టం జరగలేదని అగ్నిమాపక అధికారి చంద్రశేఖర్ తెలిపారు.

జాకీర్ అలీ హత్య కేసులో ఇద్దరికి రిమాండ్

చాంద్రాయణగుట్ట, జూన్ 25 (ఆంధ్రజ్యోతి): ఫలక్‌నుమా పోలీస్ స్టేషన్ పరిధిలో ఇటీవల జరిగిన జాకీర్ అలీ హత్య కేసులో నిందితులు ఇద్దరిని అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించామని ఫలక్‌నుమా ఏసీపీ బి.యాదగిరిస్వామి తెలిపారు. మంగళవారం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కేసు వివరాలు వెల్లడించారు. హసన్‌నగర్ షోయబ్ కాలనీకి చెందిన జాకీర్ అలీ(29) డ్రైవర్. అచ్చిరెడ్డి నగర్‌కు చెందిన ఓ వివాహితతో ఐదు సంవత్సరాలుగా వివాహేతర సంబంధం కొనసాగిస్తున్నాడు. ఆ వివాహిత కూతురిపై కూడా కన్నేశాడు. దీంతో ఆ మహిళ ఎన్నిసార్లు వారించినా వినకపోవడంతో సికింద్రాబాద్ ఈస్ట్ మారేడ్‌పల్లికి చెందిన మహ్మద్ షఫీ(31)కి విషయం తెలిపింది. షఫీ కూడా నచ్చజెప్పినా వైఖరి మార్చుకోలేదు. ఇదిలా ఉండగా ఈ నెల 21న జాకీర్ అలీ మహిళ ఇంటికి వెళ్లాడు. అప్పటికే మహిళ ఇంట్లో ఉన్న మహ్మద్ షఫీ, వివాహిత భర్త మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. క్షణికావేశంలో షఫీ ఇనుపరాడ్‌తో తలపై కొట్టడంతో జాకీర్ అలీ స్పృహతప్పి పడిపోయాడు. చనిపోయాడో? లేదో? అని షఫీ, వివాహిత భర్త కలిసి జాకీర్ అలీకి స్కిప్పింగ్ తాడుతో ఉరివేశారు. ఈ కేసులో మహ్మద్ షఫీ, వివాహిత భర్తను అరెస్టు చేశామని, వివాహిత పరారీలో ఉన్నదని ఏసీపీ తెలిపారు. సమావేశంలో ఫలక్‌నుమా ఇన్‌స్పెక్టర్ ఆదిరెడ్డి, ఎస్ఐ మహేశ్ తదితరులు పాల్గొన్నారు.



వివరాలను వెల్లడిస్తున్న ఫలక్‌నుమా ఏసీపీ యాదగిరిస్వామి



బంగారు ఆభరణాలతో సోషలైట్ బీనా మెహతా తదితరులు

ఆధునిక, సంప్రదాయ మేళవింపు సూత్ర ప్రదర్శన

- సోషలైట్ బీనా మెహతా

బంజారాహిల్స్, జూన్ 25 (ఆంధ్రజ్యోతి): ఆధునిక.. సంప్రదాయ మేళవింపు కలగలిపిన సూత్ర ఫ్యాషన్ అండ్ లైఫ్ స్టైల్ ఎగ్జిబిషన్ బంజారాహిల్స్ తాజ్ కృష్ణాలో ఏర్పాటైంది. ప్రదర్శనను సోషలైట్ బీనా మెహతా మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దేశంలోని అనేక నగరాల మహిళా వ్యాపారవేత్తలు, డిజైనర్లు ఒకే వేదికలో వేలాది రకాల ఉత్పత్తులు ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ప్రస్తుత ఫ్యాషన్ ట్రెండ్‌కు అనుగుణమైన తాజా సేకరణలతో భారతీయ దుస్తులు, డిజైనర్, వెస్ట్రన్ వేర్, ఇండియన్ అప్పారెల్, హ్యాండ్లూమ్స్, కాస్ట్యూమ్ డిజైనర్ జ్యువెలరీతో పాటు గృహోపకరణాలు, పాదరక్షలు వంటి వేలాది రకాల ఉత్పత్తులు ఒకే వేదికలో మూడు రోజులపాటు ఏర్పాటు చేసినట్టు సూత్ర నిర్వాహకులు తెలిపారు. ఈ నెల 27 వరకు ప్రదర్శన కొనసాగుతుందని, ప్రదర్శనలో 70 స్టాల్స్‌లో లెహంగాస్, డీసీనేర్ శారీస్, జ్యువెలరీ వంటి 25 వేలకు పైగా ఉత్పత్తులను అందుబాటులో ఉంచామని నిర్వాహకులు ఉమేష్ మాధ్యం తెలిపారు.

కళింగలో హ్యాండ్ టూ హ్యాండ్ చేనేత ప్రదర్శన

- ప్రారంభించిన నటి తాక్షి చిత్లోపాకర్



ఉత్పత్తులను ప్రదర్శిస్తున్న నటి తాక్షి చిత్లోపాకర్

బంజారాహిల్స్, జూన్ 25 (ఆంధ్రజ్యోతి): బంజారాహిల్స్ రోడ్ నంబర్.12లోని కళింగ కల్చరల్ హాల్లో ఏర్పాటైన హ్యాండ్ టూ హ్యాండ్ చేనేత వస్త్ర ప్రదర్శనను మంగళవారం టాలీవుడ్ వర్ధమాన నటి తాక్షి చిత్లోపాకర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భారతీయ సంస్కృతిలో పట్టు, హ్యాండ్‌లూమ్ వస్త్రోత్పత్తులకు ఎంతో ప్రత్యేకత ఉందన్నారు. ఈ ఉత్పత్తులకు నేటికీ వన్నె తగ్గలేదన్నారు. నేటి తరం యువత కూడా హ్యాండ్‌లూమ్ ఉత్పత్తులను ఆదరిస్తున్నారన్నారు. నిర్వాహకులు జయేష్‌గుప్తా మాట్లాడుతూ ఈ నెల 30 వరకు కొనసాగనున్న ప్రదర్శనలో దేశంలోని 14 రాష్ట్రాల నుంచి చేనేతకారులు, చేతి పని బృందాలు తమ సిల్క్, హ్యాండ్ లూమ్ చీరలు, డ్రెస్ మెటీరియల్ వంటి 75 వేల రకాల వస్త్రోత్పత్తులను అందుబాటులో ఉంచినట్టు తెలిపారు.



పోస్టర్‌ను ఆవిష్కరించిన దేవసేన తదితరులు

పోస్టర్ ఆవిష్కరించిన పాఠశాల కమిషనర్

హైదరాబాద్ సిటీ, జూన్25 (ఆంధ్రజ్యోతి): ఇండియన్ స్టూడెంట్స్ యూనియన్ (ఐఎస్‌యూ) రాష్ట్ర కమిటీ రూపొందించిన "మనందరి మాట బడిబాట.. ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేద్దాం" అనే పోస్టర్‌ను పాఠశాల శాఖ కమిషనర్ దేవసేన ఆవిష్కరించారు. పాఠశాల కమిషనర్ భవన్‌లో మంగళవారం జరిగిన కార్యక్రమంలో ఐఎస్‌యూ జాతీయ అధ్యక్షుడు పాపని నాగరాజు, రాష్ట్ర అధ్యక్షుడు పి.వెంకటేశ్‌గౌడ్, హైదరాబాద్ అధ్యక్షుడు సన్నీ తదితరులు పాల్గొన్నారు.

- నోట్ పుస్తకాల పంపిణీ



బేగంపేటలోని బండిమెట్ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు నోట్ పుస్తకాలు పంపిణీ చేస్తున్న ఏసీపీ గోపాలకృష్ణ, విశ్రాంత ఉపాధ్యాయులు సతీష్ తదితరులు

- బేగంపేట, జూన్ 25 (ఆంధ్రజ్యోతి)

పోటీ పరీక్షలకు ఉచిత శిక్షణ

చాదర్‌ఘాట్, జూన్ 25 (ఆంధ్రజ్యోతి): ఎస్ఐ, కానిస్టేబుల్, ఆర్‌ఆర్‌బీ, ఎస్ఎస్‌సీ, సీజీఎల్, సీహెచ్‌ఎస్‌ఎల్ తదితర పోటీ పరీక్షలకు దిల్‌సుఖ్‌నగర్‌లోని హైదరాబాద్ విజేత స్టడీ సర్కిల్ ఉచిత శిక్షణ ఇస్తుందని డైరెక్టర్ వీజేరెడ్డి తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు రెండు పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలు, సంబంధిత కోర్సుల ధ్రువీకరణ పత్రాలతో పేర్లు నమోదు చేయించుకోవాలని సూచించారు. కొత్త బ్యాచ్‌లు ప్రారంభమవుతున్నాయని, మూడు నుంచి నాలుగు నెలల పాటు సాగే ఇంటెన్సివ్ కోచింగ్‌లో ప్రతి రోజూ, వారం పరీక్షలు నిర్వహిస్తామని ఆయన వివరించారు. వివరాల కోసం విజేత స్టడీ సర్కిల్, యూనియన్ బ్యాంక్ పైన రెండో అంతస్తు, మెట్రో పిల్లర్ నంబర్ 1531, దిల్‌సుఖ్‌నగర్‌లో నేరుగా, లేదా 9949308999, 9908480999, 9908470999లో సంప్రదించవచ్చని తెలిపారు

● భవన నిర్మాణ వ్యర్థాలను తొలగించండి



బోరబండ డివిజన్ పరిధి సాయిబాబానగర్ ప్రభుత్వ పాఠశాలలో అభివృద్ధి పనులు ఇంకా కొనసాగుతున్నాయి. భవన నిర్మాణానికి సంబంధించిన ఇటుక, సిమెంట్, బండలు, ఇతర వస్తువులు పాఠశాల ఆవరణలో ఉన్నాయి. దీంతో తరగతి గదుల్లోకి వెళ్లేందుకు విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. నడిచేందుకు కూడా వీలు లేదని, తక్షణమే భవన నిర్మాణ వ్యర్థాలను తొలగించాలని విద్యార్థులు కోరుతున్నారు

- బోరబండ, ఆంధ్రజ్యోతి

● కావూరిహిల్స్ కంపు.. కంపు..



మాదాపూర్ పరిధి కావూరిహిల్స్‌లోని వేంకటేశ్వరస్వామి దేవస్థానానికి వెళ్లే ప్రధాన రోడ్డు డ్రైనేజీ మురుగు, నల్లటి బురదతో నిండిపోయింది. మెయిన్ రోడ్డుతో పాటు రోడ్ నంబర్.1లో గడిచిన వారం రోజుల నుంచి డ్రైనేజీలు పొంగి మురుగు రోడ్లపై ప్రవహిస్తోంది. దుర్వాసనకు ఆ ప్రాంతవాసులు ఇళ్లలో ఉండలేకపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి డ్రైనేజీ, మురుగునీటి సమస్యలను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు

- మోతీనగర్, ఆంధ్రజ్యోతి



సమావేశంలో మాట్లాడుతున్న కృష్ణమాచార్యులు, రాఘవరావు

రైల్వే రక్షక దళ విశ్రాంత ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలి

బౌద్ధనగర్, జూన్ 25 (ఆంధ్రజ్యోతి): రైల్వే రక్షక్ దళ విశ్రాంత ఉద్యోగుల సమస్యలను కేంద్రప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని పించనర్స్ ఆఫ్ రైల్వేస్ ఆల్ అవర్ ఇండియా ప్రధాన కార్యదర్శి కృష్ణమాచార్యులు, అధ్యక్షుడు రాఘవరావు కేంద్రప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ పించనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు వరప్రసాద్‌రెడ్డి అధ్యక్షతన మంగళవారం చిలకలగూడలో నిర్వహించిన కార్యక్రమంలో వారు ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మెడికల్ కార్డులను ఆప్‌డేట్ చేయాలని, 65సంవత్సరాలు దాటినవారికి ఐదుశాతం, 70దాటిని వారికి పది శాతం, 75దాటిన వారికి పదిహేనుశాతం రక్షక్ దళ విశ్రాంత ఉద్యోగులకు పించన్ పెంచాలని కోరారు. 20 సంవత్సరాల నుంచి పదిసంవత్సరాలకే మ్యూటేషన్‌ను విడుదల చేయాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం పరిధిలో మూడు సమస్యలు పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని వెంటనే పరిష్కారించాలని కోరారు. ఈ సందర్భంగా 80సంవత్సరాలు దాటిని 27మంది విశ్రాంత ఉద్యోగులను పూలదండలు వేసి, శాలువా కప్పి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంను ఘనంగా నిర్వహించిన ఆర్గనైజింగ్ కార్యదర్శి వి.ముత్యాలును పలువురు అభినందించారు. విద్య, టీకే సింగ్, జీవీఎస్ రాయుడు తదితరులు పాల్గొన్నారు.

నంబర్ ప్లేట్ లేకుండా వాహనం నడిపితే కఠిన చర్యలు



ఇన్‌స్పెక్టర్ మధుబాబు

తిరుమలగిరి, జూన్ 24 (ఆంధ్రజ్యోతి) : నంబర్ ప్లేట్ లేకుండా వాహనాలు నడిపితే చట్టరీత్యా కఠినంగా శిక్షిస్తామని తిరుమలగిరి ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ మధుబాబు హెచ్చరించారు. మంగళవారం పోలీస్ స్టేషన్‌లో ఆంధ్రజ్యోతితో ప్రత్యేకంగా మట్లాడారు. శాంతి భద్రతలు కాపాడడంలో భాగంగా తమవంతు కృషి చేస్తున్నామని అన్నారు. నేరాలు అదుపుచేయడానికి తమవంతు కృషిలో భాగంగా వాహనాల తనిఖీలను ముమ్మరం చేశామని చెప్పారు. ద్విచక్ర వాహనాలు నాలుగు చక్రాల వాహనాలకు నెంబర్‌ప్లేట్ లేకుండా నడిపించరాదన్నారు. ప్రస్తుతానికి వాహనాల తనిఖీలలో 11 ద్విచక్ర వాహనాలు, ఒక కారు నెంబర్ ప్లేట్ లేకుండా వాహనాదారులు రోడ్లపై తిరగడంతో వారిపై కేసులు నమోదు చేశామని చెప్పారు. నెంబర్ ప్లేట్ లేకపోవడంతో ఆక్సిడెంట్ చేసి తప్పించుకుని తిరుగుతున్నారని, దీంతో కేసులలో పురోగతి సాధించలేకపోతున్నామని అన్నారు. ఖచ్చితంగా వాహనదారులు నెంబర్ ప్లేట్ ఏర్పాటుచేసుకోవాలని సూచించారు. నేరాలు తగ్గించడానికి కృషి చేస్తున్నామని అన్నారు. ద్విచక్ర వాహనదారులు ట్రిపుల్ రైడింగ్ చేయకుండా అతివేగంతో వాహనాలు నడపవద్దని సూచించారు. తిరుమలగిరి చౌరస్తా మొదలుకుని బొల్లారం కోటేశ్వర ఆలయం వరకు ప్రమాదాలు జరగకుండా తగు జాగ్రత్త తీసుకుంటామని అన్నారు.

1 నుంచి శివపంచాయతన ఆలయ వార్షికోత్సవం

మారేడుపల్లి, జూన్ 25 (ఆంధ్రజ్యోతి): వెస్ట్ మారేడుపల్లి స్రామాట్ కాలనీలో శ్రీనాగ నాగిని రేణుక ఎల్లమ్మ శ్రీదత్త అనగేశ్వర సహిత శివ పంచాయతన ఆలయ వార్షికోత్సవ వేడుకలు జూలై 1 నుంచి 5వ తేదీ వరకు ఘనంగా నిర్వహించనున్నారు. 1వ తేదీన గణపతి పూజ, అంకురార్పణ, మండపారాధన, గణపతి హోమం, 2న శ్రీనాగ నాగిని రేణుక ఎల్లమ్మమాత శతఘటాభిషేకం, దేవి మూల మంత్ర హవనము, 3వ తేదీన దత్త హవనము, కాలభైరవ, హనుమత్, నవగ్రహ, పరివార దేవత అవనము, 4వ తేదీన రుద్రాభిషేకం, రుద్రా హవనము, 5వ తేదీన చండీ పారాయణం, చండీ హవనము, సర్వదాశాంతి హోమం, పూర్ణాహుతి, సాయంత్రం ఆరాధన సంగీత విద్యాలయ బృందంచే సంగీత కదంబము వంటి కార్యక్రమాలు ఉంటాయని ఆలయ అర్చకులు శ్రీకృష్ణశర్మ ఒక ప్రకటనలో తెలిపారు. పెద్ద సంఖ్యలో భక్తులు వార్షికోత్సవ మహోత్సవములలో పాల్గొంటారని తెలిపారు.



మాజీ ప్రధానమంత్రి వీపీ సింగ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న బీసీ సంక్షేమ సంఘం కార్యదర్శి

వీపీ సింగ్‌కు ఘన నివాళి

తార్నాక, జూన్ 25 (ఆంధ్రజ్యోతి): భారత మాజీ ప్రధానమంత్రి వీపీ సింగ్ 93వ జయంతిని పురస్కరించుకుని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగం గౌడ్ మంగళవారం ఓయూ ఆర్ట్స్ కాలేజీ ఆవరణలో వీపీ సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ప్రొ.జాడి ముసలయ్య, విద్యార్థి నాయకులు మూర్తి, నామా సైదులు, నెల్లి సత్య, మహేందర్, రవి నాయక్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

'బోనాలకు' ఆర్థిక సహాయం కోసం దరఖాస్తు చేసుకోండి

మారేడ్‌పల్లి, జూన్ 25 (ఆంధ్రజ్యోతి): ఆషాడ బోనాల ఉత్సవాలకు రాష్ట్రస్థాయి గుర్తింపు తీసుకున్న ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానిదేనని, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బోనాల ఉత్సవాలను తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత బోనాల ఉత్సవాలను నాటి ముఖ్యమంత్రి కేసీఆర్ రాష్ట్ర పండగగా ప్రకటించి ప్రభుత్వం ఆధ్వర్యంలో అత్యంత ఘనంగా నిర్వహించిన విషయాన్ని గుర్తుచేశారు. ఈ సంవత్సరం బోనాల ఉత్సవాల నిర్వహణకు ప్రభుత్వం అందించే ఆర్థిక సహాయం కోసం సనత్‌నగర్ నియోజకవర్గ పరిధిలోని ఆలయాల కమిటీ సభ్యులు రెండు రోజుల్లోగా దేవాదాయ శాఖ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ కోరారు.

పదేళ్ల తర్వాత ఆలయ కమిటీ

చిలకలగూడ కట్టమైసమ్మ, పోచమ్మ దేవాలయ సభ్యుల నియామకం

- నేడు ఆలయంలో ప్రమాణ స్వీకారం

బౌద్ధనగర్, జూన్ 25 (ఆంధ్రజ్యోతి): నూతనంగా కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన పది సంవత్సరాల తర్వాత దేవాదాయ ధర్మదాయ శాఖ చిలకలగూడ లోని కట్టమైసమ్మ, పోచమ్మ ఆలయం కమిటీని నియమించింది. ఎనిమిదిమంది కమిటీ సభ్యులను నియమిస్తూ జీవో జారీచేసింది. సంవత్సరంపాటు వీరు కమిటీ సభ్యులుగా ఉంటారు. ఈ ఎనిమిది మంది సభ్యులు బుధవారం ఉదయం 10గంటలకు ఆలయంలో అసిస్టెంట్ కమిషనర్ సంధ్యారాణి, ఇన్‌స్పెక్టర్ అండాళమ్మ, ఆలయ కార్యనిర్వహణాధికారి మహేందర్‌గౌడ్ సమక్షంలో ప్రమాణ స్వీకారం చేయనున్నారు. టీపీసీసీ కార్యదర్శి ఆదం సంతోష్‌కుమార్ ముఖ్యఅతిథిగా హాజరుకానున్నారు. ప్రతి సంవత్సరం సికింద్రాబాద్ మహంకాళి బోనాల తర్వాత అత్యంత వైభవంగా చిలకలగూడ కట్టమైసమ్మ, పోచమ్మ ఆలయ ఆషాడ బోనాలు జరుగుతాయి. ఈ బోనాల్లో సుమారు లక్షమంది భక్తులు పాల్గొంటారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఆషాడ బోనాలకు ఆలయ కమిటీలను ఏర్పాటు చేయకుండా తాత్కాలిక కమిటీలతో బోనాలను నిర్వహించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఆలయ కమిటీలను ఏర్పాటు చేయటంతో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు సంతోషం వ్యక్తంచేస్తున్నారు. ప్రస్తుతం సికింద్రాబాద్ నియోజకవర్గ శాసనసభ్యుడిగా ఉన్న తీగుళ్ల పద్మారావుగౌడ్ గత మూడు టెర్మ్‌ల నుంచి శాసనసభ్యుడిగా కొనసాగుతున్నారని, ఆలయ కమిటీలు వేయాలని పలుమార్లు విజ్ఞప్తి చేసినా పట్టించుకోలేదని బీఆర్ఎస్ నాయకులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. బీఆర్ఎస్‌లో ఉండి కష్టపడి పనిచేసినా ఫలితంలేదని వారు వాపోతున్నారు.



చిలకలగూడ కట్టమైసమ్మ, పోచమ్మ దేవాలయం

ఆలయ నూతన కమిటీ సభ్యులు వీరే..

చిలకలగూడ కట్టమైసమ్మ, పోచమ్మ ఆలయ కమిటీ సభ్యులుగా గుంటి కృష్ణ, ఎం.అమృత్, జంగిలి దేవేందర్‌యాదవ్, ఎం.జగన్‌రెడ్డి, బండారి శ్రీనివాస్‌ముదిరాజ్, ఎస్.జానకి, కేబీ.ధరమ్, ప్రధానార్చకులు తిరుమలాచారిని ఎక్స్ అఫిషియో సభ్యునిగా దేవాదాయశాఖ నియమించిది.

ఆలయ చైర్మన్‌గా గుంటి కృష్ణ



చిలకలగూడ కట్టమైసమ్మ పోచమ్మ ఆలయ చైర్మన్‌గా స్థానికవాసి గుంటి కృష్ణను ఆలయ కమిటీ సభ్యులు ఎన్నుకోనున్నారు. కాంగ్రెస్ పార్టీలో సీనియర్ నాయకుడిగా ఉన్న గుంటి కృష్ణ గతంలో రెండుసార్లు కట్టమైసమ్మ, పోచమ్మ ఆలయ చైర్మన్‌గా పనిచేశారు. ఆలయ అభివృద్ధికి తన వంతు కృషిచేస్తానని, అన్నిపార్టీల వారిని కలుపుకుని ఆషాడబోనాలను సవ్యంగా నిర్వహిస్తానని కృష్ణ తెలిపారు.

జింఖానా గ్రౌండ్ అభివృద్ధికి కృషి

- క్రీడాకారులకు ప్రోత్సాహం
- ఎమ్మెల్యే శ్రీగణేష్

బోయిన్‌పల్లి, జూన్ 25 (ఆంధ్రజ్యోతి): కంటోన్మెంట్ నియోజకవర్గంలోని క్రీడాకారులకు తగిన ప్రోత్సాహాన్ని అందిస్తూ జింఖానా గ్రౌండ్‌ను ఆధునిక హంగులతో అభివృద్ధి చేసేలా కృషి చేస్తానని కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ పేర్కొన్నారు. హైదరాబాద్ డిస్ట్రిక్ట్ యూత్ అండ్ స్పోర్ట్స్ (డీఎస్‌డీఓ) అధికారి ఎం.సుధాకర్ ఆధ్వర్యంలో జింఖానా గ్రౌండ్ కోచ్‌లు, క్రీడాకారులు, క్రీడాకారుల తల్లిదండ్రులు కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్‌ను మంగళవారం మర్యాదపూర్వకంగా కలవడం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీగణేష్‌కు పుష్పగుచ్చాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా డీఎస్‌డీఓ సుధాకర్ మాట్లాడుతూ జింఖానా మైదానం సౌకర్యాలు, అభివృద్ధి, క్రీడాకారులకు అన్నివిధాల సహకారం అందివ్వాలని కోరినట్లు తెలిపారు. సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే తనవంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని పేర్కొన్నారు. అదేవిధంగా అథ్లెటిక్స్ విభాగంలో రాష్ట్రస్థాయి, జాతీయస్థాయిలో గెలిచిన క్రీడాకారులను ఎమ్మెల్యే అభినందిండం జరిగిందన్నారు. రాబోయే రోజులలో క్రీడలపై ప్రత్యేక దృష్టి పెట్టనున్నట్లు, ప్రతి సంవత్సరం కంటోన్మెంట్‌లో పెద్ద ఎత్తున క్రీడలు నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే శ్రీగణేష్ తెలిపారన్నారు.



కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన హైదరాబాద్ జిల్లా డీఎస్‌డీఓ సుధాకర్, పలువురు క్రీడాకారులు, కోచ్‌లు

ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత

రెజిమెంటల్‌బజార్, జూన్ 25 (ఆంధ్రజ్యోతి): ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత లభిస్తుందని కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ అన్నారు. మంగళవారం మోండా డివిజన్ కుమ్మరిగూడలో శ్రీ పండితా రాజ్యమరం రాజరాజేశ్వరి అమ్మవారి దేవి ఆలయంలో నిర్వహిస్తున్న అష్టాదశ వార్షికోత్సవ వేడుకలకు హాజరై ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. నిత్య జీవితంలో ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతన కోసం కొంత సమయం కేటాయించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ అభివృద్ధి సభ్యులు వీరలక్ష్మి, ఎస్ఎస్.కుమారి, ప్రభావతి, కమిటీ సభ్యులు విజయలక్ష్మి, రాజేశ్వరి, అరుణ, అన్నపూర్ణ, రుక్మిణి, కాంగ్రెస్ పార్టీ నాయకులు శేఖర్ ముదిరాజ్, మహేష్ పాల్గొన్నారు.

జాలరులను బెదిరించి డబ్బులు లాక్కున్న రౌడీషీటర్

నార్సింగ్, జూన్ 25 (ఆంధ్రజ్యోతి): చెరువులో చేపలు పట్టుకుంటున్న జాలరులను బెదిరించిన ఓ రౌడీషీటర్ వారి వద్ద నగదు లాక్కున్నాడు. నార్సింగ్ పోలీసుల కథనం ప్రకారం.. రాజేంద్రనగర్ పోలీస్‌స్టేషన్‌లో రౌడీషీటర్‌గా నమోదైన ఇర్ఫాన్ సోమవారం రాత్రి స్నేహితులతో కలిసి పీరంచెరువు కట్టపై మద్యం తాగాడు. అదే సమయంలో చెరువులో చేపల వేటకోసం వలలు వేసేందుకు వచ్చిన ఉప్పర్‌పల్లికి చెందిన సందీప్‌కుమార్ అతని సహచరుల వద్దకు ఇర్ఫాన్ ఇతని మనుషులు వెళ్లారు. 'ఇప్పటికే అనేక మర్డర్లు చేశాను. వారం రోజుల క్రితమే జైలు నుంచి వచ్చాను. మిమ్మల్ని చంపి మళ్లీ జైలుకు పోతాను' అంటూ ఇర్ఫాన్ కత్తితీసి జాలర్ల ముందు తిప్పడంతో వారికి స్వల్పగాయాలయ్యాయి. జేబులో ఎంత ఉంటే అంత డబ్బులు ఇవ్వాలని ఇర్ఫాన్ డిమాండ్ చేయడంతో సందీప్‌కుమార్ జేబులో ఉన్న రూ.11వేలు ఇర్ఫాన్‌కు ఇచ్చేసి అక్కడి నుంచి పారిపోయారు. తర్వాత పోలీసులకు ఫిర్యాదు చేయగా వారు వెళ్లి వెతికినా అతడి ఆచూకీ లభించలేదు. ఈ కేసులో నార్సింగ్ పోలీసులు ఇతడిని అరెస్టు చేసి జైలుకు పంపారు. రౌడీషీటర్ ఇర్ఫాన్ కోసం నార్సింగ్ పోలీసులు గాలిస్తున్నారు.

జాకీర్‌అలీ హత్య కేసులో ఇద్దరి రిమాండ్



వివరాలను వెల్లడిస్తున్న ఫలక్‌నుమా ఏసీపీ యాదగిరి స్వామి

చాంద్రాయణగుట్ట, జూన్ 25 (ఆంధ్రజ్యోతి): ఫలక్‌నుమా పోలీస్‌స్టేషన్ పరిధిలో ఇటీవల జరిగిన జాకీర్ అలీ హత్య కేసులో నిందితులు ఇద్దరిని అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించామని ఫలక్‌నుమా ఏసీపీ బి.యాదగిరి స్వామి తెలిపారు. మంగళవారం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కేసు వివరాలు వెల్లడించారు.

హసన్‌నగర్ షోయబ్ కాలనీకి చెందిన జాకిర్ అలీ(29) డ్రైవర్. అచ్చిరెడ్డినగర్‌కు చెందిన ఓ వివాహితతో ఐదు సంవత్సరాలుగా వివాహేతర సంబంధం కొనసాగిస్తున్నాడు. ఆ వివాహిత కూతురిపై కూడా కన్నేశాడు. దీంతో ఆ మహిళ ఎన్నిసార్లు వారించినా వినకపోవడంతో సికింద్రాబాద్ ఈస్ట్ మారేడ్‌పల్లికి చెందిన మహ్మద్ షఫీ(31)కి విషయం తెలిపింది. షఫీ కూడా నచ్చజెప్పినా వైఖరి మార్చుకోలేదు.

ఇదిలావుండగా ఈనెల 21న జాకిర్ అలీ మహిళ ఇంటికి వెళ్లాడు. అప్పటికే మహిళ ఇంట్లో ఉన్న మహ్మద్ షఫీ, వివాహిత భర్త మధ్య వాగ్వివాదం చోటుచేసుకుంది. క్షణికావేశంలో షఫీ ఇనుపరాడ్‌తో తలపై కొట్టడంతో జాకిర్ అలీ స్పృహ తప్పిపడిపోయాడు. చనిపోయాడో లేదో అని షఫీ, వివాహిత భర్త కలిసి జాకిర్ అలీకి స్కిప్పింగ్ తాడుతో ఉరివేశారు. ఈ కేసులో మహ్మద్ షఫీ, వివాహిత భర్తను అరెస్టు చేశామని, వివాహిత పరారీలో ఉన్నదని ఏసీపీ తెలిపారు. ఈ సమావేశంలో ఫలక్‌నుమా ఇన్‌స్పెక్టర్ ఆదిరెడ్డి, ఎస్ఐ మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

కూలడానికి సిద్ధంగా ఉన్న చెట్లను తొలగించాలి

తిరుమలగిరి జూన్ 25 (ఆంధ్రజ్యోతి) : కంటోన్మెంట్ ప్రాంతంలో అధికంగా రక్షణ శాఖ స్థలాలు ఉన్నాయి. ఆంగ్లేయుల కాలంలో ఆ స్థలాల్లో ఏర్పాటు చేసి న పెద్ద పెద్ద వృక్షాలు ఉన్నాయి. వీటితో ఇక్కడ వర్షాపాతం కూడా అధికంగా ఉంటుంది. దీంతో పాటు కాలుష్యం కూడా తక్కువగా ఉంటుంది. ఉదయం, సాయంత్రం పూట ఆహ్లాదకరమైన వాతావరణం కనిపిస్తుంది. అయితే ఎన్నో ఏళ్ల క్రితం రహదారులకు ఇరువైపులా ఏర్పాటు చేసిన మర్రిచెట్లు వటవృక్షాలుగా ఎదిగాయి. కొన్ని ప్రస్తుతం కొమ్మలు విరిగిపోవడంతో పాటు మొదలు ఎండిపోయి, శిథిలావస్థకు చేరుకున్నాయి. రహదారుల గుండా ప్రయా ణం చేస్తున్న వాహనదారుల మీద కూలి కొందరు మృత్యువాత పడగా, మరికొందరు తీవ్ర గాయాలపాలైన సంఘటనలు కోకొల్లలు. గతంలో ఓ వాహనదారుడు తిరుమలగిరి కేంద్రీయ విద్యాలయం నుంచి అమ్ముగూడ వైపు వెళుతుండగా నాగదేవత బ్రిడ్జి దాటగానే ఓ చెట్టు పెద్ద మండ ఒకటి అతనిపై కూలి అక్కడికక్కడే మృతిచెందాడు. అదేవిధంగా కొద్ది నెలల క్రితం బొల్లారంలోని సర్దార్ వల్లభాయ్ పటేల్ ఆస్పత్రి ద్విచక్ర వాహనంపై బొల్లారం ప్రభుత్వ పాఠశాలకు చెందిన టీచర్ తన భర్తతో కలిసి చికిత్స నిమిత్తం వచ్చారు.

ఆస్పత్రి ప్రాంగణంలోకి రాగానే ఎండిపోయిన చెట్టు వారిపై కూలి పడిపోయింది. దీంతో ఆమె భర్త స్పాట్‌లో చనిపోగా ఆమెకు తీవ్ర గాయాలు అయ్యాయి. నడుము కుడి కాలు విరిగింది. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా కంటోన్మెంట్ ఉద్యానవన శాఖ అధికారులు కూలిపోవడానికి సిద్ధంగా ఉన్న చెట్లు తొలగించి ప్రమాదాలు జరగకుండా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.



తిరుమలగిరి కేంద్రీయ విద్యాలయం సమీపంలో శిథిలావస్థలో ఉన్న మర్రి చెట్టు

ప్రమాదకరంగా ట్రాన్స్‌ఫార్మర్లు



చాచానెహ్రూనగర్‌లో చెత్త కుప్పల నడుమ ట్రాన్స్‌ఫార్మర్

పద్మారావునగర్, జూన్ 24 (ఆంధ్రజ్యోతి): ప్రజానీకానికి సమీపంలో ప్రమాదభరితంగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు దర్శనమిస్తున్నాయి. విద్యుత్, జీహెచ్ఎంసీ శాఖల అధికారులు, సిబ్బంది నడుమ సమన్వయలోపం కారణంగా సరైన నిర్వహణ కురువై, విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ పరిసరాలు చెత్తకుప్పలకు నిలయంగా మారుతున్నాయనడంలో సందేహంలేదు. ప్రమాదవశాత్తు చెత్తకుప్పలకు మంటలు అంటుకొని ట్రాన్స్‌ఫార్మర్‌కు సంబంధించిన ఎలక్ట్రికల్ కేబుల్స్‌కు మంటలు అంటుకొని ప్రమాదం జరగటానికి అవకాశం లేకపోలేదు.

ప్రమాద నివారణ చర్యలు చేపట్టాలి



చాచానెహ్రూనగర్‌లోని ప్రధాన రోడ్డు పక్కన ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ పరిసరాలు పూర్తిగా చెత్తా చెదారంతో నిండిపోయాయి. విద్యుత్ సరఫరా కేబుల్ బాక్స్ పూర్తిగా నేలకు ఆనుకొని ఉండడం వలన అగ్నిప్రమాదం జరగటానికి అవకాశం ఉంది. వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకొని సంబందిత అధికారులు తక్షణ చర్యలు చేపట్టాలి.

ఎలకొండ శ్రీనివాస్ ముదిరాజ్.
బీజేపీ నాయకులు, సీసీనగర్.



కవాడిగూడ మెయిన్ రోడ్డులో చెత్త కుప్పల మధ్యన పవర్ గ్రిడ్ కార్యాలయానికి సమీపంలోని ట్రాన్స్‌ఫార్మర్



ఉప్పరబస్తీలో అధికారులతో మాట్లాడుతున్న కార్పొరేటర్ సామల హేమ

పలు ప్రాంతాల్లో కార్పొరేటర్ పర్యటన

బౌద్ధనగర్, జూన్ 25 (ఆంధ్రజ్యోతి): సీతాఫల్‌మండి డివిజన్లో ఉప్పరబస్తీ, మేడిబావి, బ్రాహ్మణబస్తీ తదితర ప్రాంతాల్లో అధికారులతో మంగళవారం కార్పొరేటర్ సామల హేమ పర్యటించారు. గుంతలు పడిన రోడ్లు, సీవరేజీ, మంచినీటి, పారిశుధ్యం తదితర సమస్యలపై అధికారులతో చర్చించారు. నూతన రోడ్లుకు ప్రపోజల్స్ పంపాలని అధికారులను ఆదేశించారు. స్థానికంగా మంచినీరు కలుషితం కాకుండా తగిన చర్యలు చేపట్టాలని జలమండలి అధికారికి సూచించారు. ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసీ ఏఈ కౌశిక్, జలమండలి మేనేజర్ అన్విత్, నాయకులు రమేష్ తదితరులు పాల్గొన్నారు.

అధికారుల దృష్టికి తీసుకెళ్తా

రెజిమెంటల్‌బజార్, జూన్ 25 (ఆంధ్రజ్యోతి): తన దృష్టికి తీసుకొచ్చిన సమస్యలు సంబంధిత శాఖ అధికారులతో మాట్లాడి పరిష్కారం అయ్యేలా చర్యలు తీసుకుంటానని బస్తీవాసులకు కార్పొరేటర్ కొంతం దీపిక హామీ ఇచ్చారు. మంగళవారం మోండా డివిజన్ సాంబమూర్తినగర్‌లో పర్యటించి స్థానికులను అడిగి బస్తీలో సమస్యలు తెలుసుకున్నారు.

'విద్యతోనే దేశాభివృద్ధి'

చిలకలగూడ, జూన్ 25 (ఆంధ్రజ్యోతి): విద్యతోనే దేశం అభివృద్ధి పథంలో పయనుస్తుందని డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ స్కూల్స్ (మారేడుపల్లి) మదన్‌మోహన్ రెడ్డి పేర్కొన్నారు. మెట్టుగూడ డివిజన్, దూద్‌బావి ప్రభుత్వ పాఠశాలలో వైర్స్ అండ్ ప్లాస్టిక్స్ సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం, విద్యార్థులకి నోట్ పుస్తకాలు, స్టేషనరీ వస్తువులు అందజేశారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన మదన్ మోహన్ రెడ్డి మాట్లాడుతు విద్యార్థులు లక్ష్యంతో చదివి, ఉన్నత శిఖరాలకి చేరుకోవాలని, వ్యాపార సంస్థలు ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన సౌకర్యాలకి తమవంతు సహాయసహకారాలు అందజేయాలని తెలిపారు. ఈకార్యక్రమంలో వైర్స్ అండ్ ప్లాస్టిక్స్ సంస్థ కార్యదర్శి సుధాకర్, ఉపాధ్యాయులు మల్లీశ్వరి, నాగశృతి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన సౌకర్యాలు కల్పించాలి

చిలకలగూడ, జూన్ 25 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన సౌకర్యాలు కల్పించి, భావిభారత పౌరులుగా తీర్చిదిద్దాలని సీపీఐ సికింద్రాబాద్ ప్రధాన కార్యదిర్శి కాంపల్లి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ప్రభుత్వ పాఠశాలల పరిశీలనలో భాగంగా మంగళవారం మెట్టుగూడ డివిజన్, దూద్‌బావి, ప్రభుత్వ పాఠశాలను కార్యకర్తలతో కలిసి సందర్శించారు. దూద్‌బావి ప్రభుత్వ పాఠశాలకి వెళ్లే దారి సరిగా లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని, మధ్యాహ్న భోజనం నాసిరకంగా వుందని, పిల్లలకి సరిపడా తరగతి గదులు నిర్మించాలని, విద్యాశాఖ అధికారులు తనిఖీలు నిర్వహించి మెరుగైన విద్యను అందించటానికి కృషి చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు కోమురెల్లి బాబు, యాదగిరి, చందర్,గౌరి, నాగరాజు, శ్రీహరి, బిక్షపతి పాల్గొన్నారు.

గాంధీలో వైద్యుల అవగాహన ర్యాలీ



గాంధీ ఆస్పత్రిలోని ఓపీ డీవీఎల్ విభాగంలో వైద్యుల అవగాహన ర్యాలీ

అడ్డగుట్ట, జూన్ 25 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ విటిలిగో దినోత్సవం సందర్భంగా గాంధీ ఆస్పత్రిలోని ఓపీ డీవీఎల్ విభాగంలో వైద్యులు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఓపీకి వచ్చే రోగులకు విటిలిగో వైద్యం గురించి అవగాహన కల్పించి చర్మవ్యాధి గురించి వివరించారు. కార్యక్రమంలో డెర్మటాలజీ విభాగం విభాగాధిపతి డాక్టర్ సుధారాణి, అసోసియేషన్ ప్రొఫెసర్ డాక్టర్ రఘుకిరణ్, అసిస్టెంట్ ప్రొఫెసర్లు, ప్రొఫెసర్లు పాల్గొన్నారు.


నేడు ఒంటరి మహిళ, వితంతు దినోత్సవాలు

అడ్డగుట్ట, జూన్ 25(ఆంధ్రజ్యోతి): యాక్షన్ ఎయిడ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో బుధవారం తుకారాంగేట్‌లోని బోయ బస్తీలో మల్టీప్లెక్స్ ఫంక్షన్ హాలులో ఒంటరి మహిళ, వితంతు దినోత్సవ వేడుకలు నిర్వహిస్తున్నట్లు ఆ సంఘం కో-ఆర్డినేటర్ సుమతి తెలిపారు. సాయంత్రం 3గంటల నుంచి ఐదు గంటల వరకు పలు కార్యక్రమాలు ఉంటాయన్నారు. సమస్యలు ఉంటే కార్యక్రమంలో సంఘం దృష్టికి తీసుకురావచ్చన్నారు. ఒంటరి మహిళలకు సాధికారత కల్పించడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని ఆమె తెలిపారు.

రిజర్వేషన్లపై పార్లమెంటులో ప్రధాని ప్రకటన చేయాలి

- జాజుల శ్రీనివాస్‌గౌడ్

కవాడిగూడ, జూన్ 25 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం జరుగుతున్న పార్లమెంటు సమావేశాల్లో దేశంలో సామాజిక రిజర్వేషన్లపై ప్రధాని నరేంద్రమోదీ స్పష్టమైన విధాన ప్రకటన చేయాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ డిమాండ్ చేశారు. మంగళవారం నగరంలోని ఇందిరా పార్కు చౌరస్తాలో ఉన్న బీసీ భవన్‌కార్యాలయంలో ఓబీసీలకు ఉద్యోగ రంగంలో 27శాతం రిజర్వేషన్లను కల్పించిన మాజీ ప్రధాని, స్వర్గీయ వీపీ సింగ్ (విశ్వనాథ ప్రతాప్‌సింగ్) 93వ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి జాజుల శ్రీనివాస్‌గౌడ్ పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. అనంతరం జరిగిన జయంతి సభలో జాజుల శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ ఇటీవల పాట్నా హైకోర్టు ఇచ్చిన తీర్పుపై ఢిల్లీలో అఖిలపక్ష రాజకీయ పార్టీల సమావేశం ఏర్పాటు చేయాలని కోరారు. ప్రధాని మోదీ బీసీలకు జరిగిన అన్యాయాన్ని గ్రహించి దేశవ్యాప్తంగా బీసీ కులగణన చేపట్టి జనాభా దామాషా ప్రకారం బీసీలకు 50శాతం రిజర్వేషన్లు పెంచాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీసీ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ విజయ్ భాస్కర్, బీసీ నేతలు బూడిద మల్లికార్జునయాదవ్, పానుగంటి విజయ్, మాదేశీ రాజేందర్, వీరమల్ల కార్తీక్, ప్రవీణ్‌యాదవ్, జాజుల భాస్కర్, మహేందర్ పాల్గొన్నారు.



రైల్వే సంచాలన్ ముందు ధర్నా చేస్తున్న రైల్వే లోకో పైలట్ ఉద్యోగులు

రన్నింగ్ స్టాఫ్ డ్యూటీని 8 గంటలకు పరిమితం చేయాలి

సికింద్రాబాద్ రైల్వే స్టేషన్, జూన్ 25 (ఆంధ్రజ్యోతి): దీర్ఘకాలికంగా ఉన్న ఖాళీలను వెంటనే భర్తీ చేయాలని ఆల్ ఇండియా లోకో రన్నింగ్ స్టాఫ్ అసోసియేషన్ సికింద్రాబాద్ డివిజన్ కార్యదర్శి జిలానీ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లోకో రన్నింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం సికింద్రాబాద్ రైల్వే సంచాలన్ భవన్ ఎదురుగా ఉద్యోగులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైల్వే రంగంలో పనిచేస్తున్న రన్నింగ్ స్టాఫ్ సమస్యలు చాలా ఉన్నప్పటికీ కేంద్రం పట్టించుకోవడంలేదని విమర్శించారు. భారతీయ రైల్వేలో కార్మికులకు ఇచ్చినట్లుగా రన్నింగ్ సిబ్బందికి కూడా వారాంతపు విశ్రాంతి 46 గంటలు ఇవ్వాలన్నారు. రన్నింగ్ స్టాఫ్‌కు 8 గంటల డ్యూటీ, నైట్ డ్యూటీ రెండు రాత్రులకు పరిమితం చేయాలని, క్షేత్రస్థాయిలో దీర్ఘకాలికంగా ఉన్న రన్నింగ్ స్టాఫ్ ఖాళీల ఉద్యోగాలను వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. భారత రైల్వేలోని అన్ని డివిజన్‌లకు చెందిన ఉద్యోగులు దాదాపు రెండు వందలమంది కుటుంబ సభ్యులతో కలిసి ఈ ధర్నాలో పాల్గొన్నారు. కార్యక్రమంలో లోకో పైలట్ అసోసియేషన్ సెంట్రల్ ఉపాధ్యక్షుడు హనుమయ్య, సికింద్రాబాద్ డివిజనల్ కార్యదర్శి శ్రీజిత్, హైదరాబాద్ డివిజన్ కార్యదర్శి రామరాజు, ఆర్గనైజింగ్ కార్యదర్శి లక్ష్మీనారాయణ, ఎం.టి.రెడ్డి, అనిష్‌కుమార్, గోవిందరాజులతో పాటు సికింద్రాబాద్, హైదరాబాద్ డివిజన్ సభ్యులు, కార్యదర్శులు పాల్గొన్నారు. ధర్నా అనంతరం రైల్వే డీఆర్ఎంకు వినతిపత్రం సమర్పించారు.